క్లుప్తంగా

ఉత్తమ ఉపాధ్యాయులుగా ఇద్దరు ఎంపిక


ప్రసన్న లక్ష్మి


వి.చంద్రావతి

మైదుకూరు : మైదుకూరు జెడ్పీ హైస్కూల్ (బాలుర), (బాలికలు)కు చెందిన ప్రసన్న లక్ష్మి, వి.చంద్రావతిలు జోనల్ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయినులుగా ఎంపికయ్యారు. జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందజేయనున్నారు. మైదుకూరు జెడ్పీ హైస్కూల్ బాలురు నుంచి ఫిజికల్ ఎడ్యుకేషన్ పాఠశాల సహాయకురాలు చంద్రావతి, బాలికల హైస్కూల్ నుంచి భౌతిక శాస్త్ర ఉపాధ్యాయిని ప్రసన్న లక్ష్మి ఎంపికయ్యారు.

ఐఎంఏ అధ్యక్షుడిగా డాక్టర్ జీవీజీ మహేష్



ప్రొద్దుటూరు క్రైం : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రొద్దుటూరు శాఖ అధ్యక్షుడిగా డాక్టర్ జీవీజీ మహేష్ ఎన్నికయ్యారు. స్థానిక జమ్మలమడుగు రోడ్డులోని ఐఎంఏ హాల్‌లో బుధవారం ఎన్నికల అధికారి డాక్టర్ సాయిప్రసాద్ పర్యవేక్షణలో 2023–24 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సెక్రటరీగా డాక్టర్ వై హరీష్‌కుమార్, ట్రెజరర్‌గా డాక్టర్ సల్మాబాను ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి పలువురు వైద్యులు అభినందనలు తెలిపారు. ఈ రోజు నుంచి నూతన కార్యవర్గం వైద్యులకు, ప్రజలకు అందుబాటులో ఉంటుందని అధ్యక్ష,కార్యదర్శులు డాక్టర్ జీవీజీ మహేష్, డాక్టర్ వై హరీష్‌కుమార్‌లు తెలిపారు.

ఆర్టీసీ ప్రయాణికులకు బహుమతులు


శ్వేతకు గిఫ్ట్ అందిస్తున్న ఆర్టీసీ డీఎం మల్లికార్జునరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు ఆర్టీసీ డిపో వారు ప్రొద్దుటూరు – ఆళ్లగడ్డ రూట్‌లో తిరిగే ప్రయాణికులకు గిఫ్ట్ స్కీంను ప్రవేశపెట్టారు. అందులో భాగంగా బుధవారం ప్రయాణికుల టికెట్ల నుంచి లక్కీ డిప్ తీసి ముగ్గురిని ఎంపిక చేశారు. వారికి గిఫ్టలను ఆర్టీసీ డిపో మేనేజర్ మల్లికార్జునరెడ్డి అందించారు. కార్యక్రమంలో సీఐ లావణ్య, ఎస్‌టీఓ సుబ్బమ్మ పాల్గొన్నారు.

ఎంబీఏ, బీటెక్ ఫలితాలు విడుదల


ఫలితాలను విడుదల చేస్తున్న జేఎన్‌టీయూ ప్రొఫెసర్, సీబీఐటీ ప్రిన్సిపాల్

చాపాడు : స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) 2022–23 విద్యా సంవత్సరం అటానమస్ బ్యాచ్‌కు చెందిన ఇంజినీరింగ్ సెకెండియర్ రెండో సెమిస్టర్, ఎంబీఏ రెండో సెమిస్టర్ పరీక్షా ఫలితాలను బుధవారం విడుదల చేశారు. అనంతపురం జేఎన్‌టీయూ ప్రొఫెసర్ ఎం.సూర్యనారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఫలితాలను విడుదల చేశారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు సీబీఐటీ ప్రిన్సిపాల్ డా.జీ. శ్రీనివాసులరెడ్డి తెలిపారు.

సమస్యలను పరిష్కరించాలి


పోస్టాఫీసు ఎదుట నిరసన చేపట్టిన తపాలా ఉద్యోగులు

కలసపాడు : స్థానిక పోస్టాఫీసు ఎదుట బ్రాంచ్ పోస్టుమాస్టర్లు, డీఓలు బుధవారం వారి సమస్యలను పరిష్కరించాలని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామీణ తపాలా ఉద్యోగుల మండల అధ్యక్షుడు వేణుగోపాల్ మాట్లాడుతూ 8 గంటల పని, పెన్షన్‌తో సహా అన్ని ప్రయోజనాలు మంజూరు చేయాలని, సీనియర్ జీడీఎస్ ఉద్యోగులకు 12, 24, 36 సంవత్సరాల సర్వీసుకు అదనపు ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలన్నారు. రూ.5 లక్షల గ్రూప్ ఇన్స్యూరెన్స్ ఉండాలని, గ్రాడ్యూటీ రూ.5 లక్షలకు పెంచాలని, రెగ్యులర్ జీడీఎస్‌లు సెలవు పెట్టినప్పుడు వర్క్‌లోడ్‌తో సంబంధం లేకుండా సబ్‌స్టిట్యూట్‌ను అనుమతించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తపాలా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విష జ్వరాలపై దృష్టి సారించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఇటీవల నగరవ్యాప్తంగా విష జ్వరాలు పెరుగుతున్నాయని వాటిపైన వైద్యాధికారులు నగరపాలక సంస్థ ప్రతినిధులు దృష్టి సారించాలని కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు చేపల పుల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్ష వినియోగించుకోవాలి


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి


చాపాడు : చియ్యపాడులో మహిళకు మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి


బద్వేలులో మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

ప్రొద్దుటూరు : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ప్రొద్దుటూరు మండలంలోని దొరసానిపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిబిరానికి వచ్చిన వైద్యులు, ప్రజలతో మాట్లాడారు. ఐసీడీఎస్ అధికారులు ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు దూరంలో ఉన్న ఆస్పత్రులకు వెళ్లకుండా ఇంటి వద్దకే వచ్చి వైద్యం చేసేలా జగనన్న ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని, ప్రతి ఇంటిలోని వారికి ఆరోగ్య పరీక్షలకు సంబంధించి రికార్డు ఇవ్వడం జరుగుతుందన్నారు. జెడ్పీ వైస్ చైర్ పర్సన్ జేష్టాది శారద, సర్పంచ్ అరవ ఈశ్వరమ్మ మునివర, ఉప సర్పంచ్ మార్తల లక్ష్మీనారాయణ రెడ్డి, ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మార్తల ఓబుళరెడ్డి, నాయకులు పాతకోట బలరామిరెడ్డి, పునరుద్రారెడ్డి, చిన్నరెడ్డి, తహసీల్దార్ నజీర్ అహ్మద్, ఎంపీటీసీ మేరి, పంచాయతీ కార్యదర్శి మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

బ్లాక్ బోర్డులు కూడా మా ప్రభుత్వమే ఏర్పాటు చేసింది

గతంలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దయనీయంగా ఉండేదని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. తరగతి గదిలోని బ్లాక్ బోర్డు మొదలు పాఠశాలకు కావాల్సిన మరుగుదొడ్ల వరకు అన్నీ మా ప్రభుత్వంలో నిర్మించామని చెప్పడానికి గర్వంగా ఉందన్నారు. మనబడి నాడు–నేడు కార్యక్రమం ద్వారా దొరసానిపల్లె హైస్కూల్‌కు చాలా సమస్యలు పరిష్కారమయ్యాయన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో అందరికీ ఆరోగ్యం

చాపాడు: ప్రభుత్వం నిర్వహిస్తోన్న జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. చియ్యపాడు గ్రామంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే పర్యవేక్షించారు. గ్రామంలో 345 మందికి అన్ని రకాలైన వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హాజరైన ఎమ్మెల్యే ఐదు చోట్ల ఏర్పాటు చేసిన ఓపీ విభాగాలను పరిశీలించి అక్కడ వైద్యం అందించే వైద్యులు, చికిత్సలు పొందే ప్రజలతో ఇక్కడ అందే వైద్య సేవలపై ఆరాదీశారు. అనంతరం కంటి వెలుగు పథకం క్రింద మంజూరైన కంటి అద్దాలను బాధితులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండల కేంద్రాలకు, పట్టణాలకు వెళ్లలేని గ్రామీణ ప్రాంతాల ప్రజలందరికీ నాణ్యమైన వైద్యం అందించాలనే ఉద్దేశ్యంతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య శిబిరాలను నిర్వహించేలా చర్యలు తీసుకున్నారన్నారు. ఇదే కాకుండా ప్రతి 15 రోజులకు ఒక సారి 104 వాహనంతో వైద్యాధికారి సిబ్బందితో కలసి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తారన్నారని, అక్కడ అన్ని రకాలైన మందులు పొందవచ్చన్నారు. అధికారులు, వైద్య సిబ్బందికి స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పీవీ రమణారెడ్డి భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, ఎంపీపీ లక్ష్మయ్య, ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు, తహసీల్దారు యామిని, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వేమారెడ్డి, వైద్యులు శ్రీవాణి, ఓబులేసు, విజయనరసింహారెడ్డి, ఆప్తాలమిక్ ఆఫీసర్ తేజ పాల్గొన్నారు.

పేదల ఇళ్ల వద్దకే వైద్యసేవలు

బ్రహ్మంగారిమఠం : పేదల ఇళ్ల వద్దకే వైద్య సేవలను తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందని, ఇందులో భాగంగానే జగనన్న సురక్ష వైద్య శిబిరాలని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని తోట్లపల్లె పంచాయతీ పాపిరెడ్డిపల్లెలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కడప రిమ్స్‌నుంచి వచ్చిన డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం మన ప్రభుత్వం తెచ్చిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గం కన్వీనర్ శెట్టిపల్లె నాగిరెడ్డి, ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, మండల ప్రత్యేక అధికారి నరసింహారెడ్డి, సర్పంచ్ రాయపురెడ్డి లక్ష్మిదేవి, ఎంపీటీసీ ఓబుల్‌రెడ్డి, ఎంపీడీఓ వెంగమునిరెడ్డి, డీటీ జాన్స్, డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా

బద్వేలు అర్బన్ : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించారని ఎమ్మెల్యే డాక్టర్ సుధ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని తిప్పనపల్లె సచివాలయంలో నిర్వహించిన మెడికల్ క్యాంపులో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రభుత్వ ఆసుపత్రులను నాడు–నేడు కార్యక్రమం ద్వారా అభివృద్ధి, వైఎస్సార్ విలేజ్ హెల్త్‌క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అమలులోకి తెచ్చిందన్నారు. సిబ్బంది అంకితభావంతో పనిచేసి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బోడపాటి రామసుబ్బారెడ్డి, సర్పంచ్‌లు గోపాల్‌రెడ్డి, రమాదేవి, ఉప సర్పంచ్ సుధాకర్, తహసీల్దారు మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ నూర్జహాన్, మండల స్పెషలాఫీసర్ ఖాదర్‌బాష, ఆరోగ్య సురక్ష నోడల్ ఆఫీసర్ రమేష్‌రెడ్డి, మండల నాయకులు వెంకటసుబ్బారెడ్డి, సాంబశివారెడ్డి, డాక్టర్ రాజగోపాల్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, రామిరెడ్డి, వైద్యాధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గోపవరంలో..

గోపవరం : మండలంలోని టీ.సండ్రపల్లెలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. పేద, మధ్య తరగతి వారందరికి కూడా వైద్యం అందించాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ముఖ్య ఉద్దేశ్యమని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ తెలిపారు. దాదాపు 300 మందికి పైగా వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ హసీనా, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మల్లికార్జునరెడ్డి, సచివాలయ కన్వీనర్ పుల్లయ్య, ఎస్.రామాపురం సర్పంచ్ రాధాకృష్ణారెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనాథ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, వైద్యసిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కలసపాడులో..

కలసపాడు : ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ సుధ తెలిపారు. బుధవారం మండలంలోని ఎగువతంబళ్ళపల్లె సచివాలయం వద్ద నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేసి మాట్లాడారు. ప్రతిఒక్కరు ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష అన్నారు. 357 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 7 మందిని పెద్ద ఆసుపత్రులకు రెఫర్ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు అంకనగురివిరెడ్డి, బి.నారాయణ యాదవ్, పురుషోత్తంరెడ్డి, ఎంపీడీఓ మహబూబ్‌బీ, తహసీల్దారు రవీంద్రారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బి.కోడూరులో

బి.కోడూరు : జగనన్న ఆరోగ్య సురక్ష సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని పెద్దుళ్ళపల్లె గ్రామ సచివాలయం పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. శిబిరంలో 228 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ చంద్రహాసరెడ్డి, వైద్యాధికారులు డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు, డాక్టర్ ఉదయ్‌కిరణ్, కంటి స్పెషలిస్టు ఎం.కవిత, జనరల్ సర్జన్ డాక్టర్ అనిల్ కుమార్, ఆరోగ్యమిత్ర సుధాకర్‌రెడ్డి, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కాశినాయనలో..

కాశినాయన : మండలంలోని వంకమర్రి ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఎస్.విశ్వనాథరెడ్డి పరిశీలించారు. శిబిరంలో ఏర్పాటు చేసిన వైద్య, ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్, ఇతర శాఖల స్టాల్స్‌ను పరిశీలించి మాట్లాడారు. జగనన్న ప్రజల కోసమే ఇవన్నీ చేస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ చంద్రహాసరెడ్డి, వైద్యాధికారి డాక్టర్ ప్రశాంతి, ఎంపీడీఓ మైథిలి, తహసీల్దారు రామచంద్రుడు, ఈఓపీఆర్‌డీ ముజఫర్‌రహీమ్, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్ చేసిన అభివృద్ధిని ఇంటింటికి వెళ్లి చెప్పాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : సీఎం వైఎస్ జగన్ చేసిన అభివృద్ధిని, ప్రతిపక్ష నేత చంద్రబాబు చేసిన మోసాన్ని పోల్చుతూ ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు నుంచి 20వ వార్డు వరకు వార్డు పరిధిలోని కౌన్సిలర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమంపై శేగిరెడ్డి కాటిరెడ్డి కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీ వార్డులు, గ్రామాల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పూర్తయిన తర్వాత ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ప్రతి వార్డులో, గ్రామంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి కార్యక్రమాన్ని జరపాలన్నారు. ప్రభుత్వంలో మంజూరైన సంక్షేమ పథకాలను ఇంటింటికి వెళ్లి వివరించడంతో పాటు రాత్రికి అక్కడే బస చేసి మేధావులు, విద్యావంతులతో చర్చించాలని సూచించారు. ఈ గొప్ప కార్యక్రమాన్ని క్రమశిక్షణతో ప్రతి ఒక్కరూ నిర్వహించాలని కోరారు. మున్సిపాలిటీలో రూ.100 కోట్లతో కాలువలు, రోడ్లు నిర్మించామని, ఎన్నో ఏళ్లుగా రోడ్లు లేని గ్రామాలకు రోడ్లు నిర్మించామన్నారు. ముందుగా వైఎస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్లు పాతకోట బంగారు మునిరెడ్డి, ఆయిల్ మిల్ ఖాజా, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ కల్లూరు నాగేంద్రారెడ్డి, వార్డు సచివాలయాల ఇన్‌చార్జి కాకర్ల నాగేశ్వారెడ్డి, పద్మశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, పట్టణాధ్యక్షులు కామిశెట్టి బాబు, కోనేటి సునంద, హౌస్ బిల్డింగ్ సొసైటీ చైర్మన్ ద్వార్శల భాస్కర్‌రెడ్డి, పద్మశాలీయ విభాగం జిల్లా అధ్యక్షురాలు మద్దూరి దేవి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మార్తల ఓబుళరెడ్డి, కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షురాలు గజ్జల కళావతి, మున్సిపల్ కౌన్సిలర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నిర్మాణంలో ఆలస్యం జరిగితే జరిమానా


మార్కెట్ నిర్మాణ పనులపై ఆలస్యంపై కంపెనీ మేనేజర్‌తో మాట్లాడుతున్న ఎస్ఈ శ్రీనాథరెడ్డి

ప్రొద్దుటూరు : సకాలంలో పనులు పూర్తి చేయకుండా ఆలస్యం జరిగితే అందుకు తగినట్లుగా కాంట్రాక్టర్‌కు జరిమానా విధిస్తానని ప్రజారోగ్య శాఖ ఎస్ఈ శ్రీనాథరెడ్డి తెలిపారు. రూ.50.90 కోట్లతో నిర్మిస్తున్న స్థానిక కూరగాయల మార్కెట్‌ను బుధవారం సాయంత్రం అనంతపురం నుంచి వచ్చిన ఎస్ఈ పరిశీలించారు. గతంలో వచ్చినప్పుడు ఇప్పటికి పనుల్లో పెద్ద వ్యత్యాసం కనిపించలేదన్నారు. ఎక్కువ మంది కూలీలను నియమించి పనులు వేగంగా చేయాలని సూచించారు. నిబంధనల ప్రకారం నిర్మాణం చేపట్టాలని తెలిపారు. అనంతరం గోకుల్ నగర్‌ను పరిశీలించారు. రూ.160 కోట్లతో మున్సిపాలిటీ పరిధిలో నిర్మించనున్న డ్రైనేజీ కాలువల ఆధునీకరణ పనులను ఈ వీధి నుంచే ప్రారంభిస్తామని ఎస్ఈ తెలిపారు. అనంతరం సినీ హబ్ వద్ద ఉన్న మదూరు డ్రైనేజీ కాలువను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, ఈఈ చెన్నకేశవరెడ్డి, మున్సిపల్ ఇంజనీర్ సాయికృష్ణ, డీఈలు దాస్, వెంకటరమణ, కంపెనీ మేనేజర్ చలపతి, వైఎస్సార్‌సీపీ నాయకుడు గురునాథరెడ్డి పాల్గొన్నారు.

వన్యప్రాణులను సంరక్షించాలి


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఫారెస్టు అధికారులు

కాశినాయన : ప్రతిఒక్కరూ వన్యప్రాణులను సంరక్షించాలని పోరుమామిళ్ళ ఫారెస్టు రేంజ్ అధికారి వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని వరికుంట్ల కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో ఎస్ఓ మెర్సీరాణి అధ్యక్షతన ఫారెస్టు అధికారులు వన్యప్రాణుల సంరక్షణపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సెక్షన్ అధికారి శ్రీకృష్ణ, బీట్ అధికారులు, ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచ జంతు దినోత్సవం

మైదుకూరు : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రపంచ జంతు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జంతు శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ నరసింహారావు మాట్లాడుతూ జంతువుల పరిరక్షణ అందరి బాధ్యత అని, మానవులు సంతోషంగా, సుభిక్షంగా ఉండాలంటే జంతువులను కాపాడుకోవాలని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి మాట్లాడుతూ ఆవరణ శాస్త్రం, జీవ వైవిధ్యంలో జంతువుల పాత్ర చాలా కీలకమైనదన్నారు. జిల్లాలోని అరుదైన కలివికోడి ప్రాముఖ్యాన్ని వివరించారు. అధ్యాపకులు పీవీ కృష్ణారెడ్డి, అయ్యవారు రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలని వినతి

కలసపాడు : వైఎస్సార్ క్రాంతి పథకంలో పనిచేస్తున్న వీఓఏల సమస్యలు పరిష్కరించాలని బుధవారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలకు వీఓఏలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీఓఏలు మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలో 27,837 మంది వీఓఏలుగా పనిచేస్తున్నామని, గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద మహిళలను ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేస్తూ అనునిత్యం అందుబాటులో ఉండి ప్రతి కార్యక్రమాన్ని వారి చెంతకు చేరుస్తామన్నారు. అలాంటి మాకు ఉద్యోగ భద్రత కల్పించాలని, నేరుగా వేతనాలు మా ఖాతాల్లో జమ చేయాలని, అర్హులైన వీఓఏలను సీసీలుగా ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

12న వాహనాల వేలం

ప్రొద్దుటూరు : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని ఐదు పాత వాహనాలకు ఈనెల 12న కళాశాల ఆవరణలో వేలం నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు. వివరాలకు 9912342022కు సంప్రదించాలని కోరారు.

రేపు హోమం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం 6 గంటలకు ఆరుద్ర నక్షత్ర పర్వదినం సందర్భంగా మృత్యుంజయ హోమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ శంకర్ బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి కుంకుమార్చన, అగస్త్యేశ్వరస్వామికి రుద్రాభిషేకం, లోకకళ్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్రహోమం నిర్వహిస్తున్నామని, భక్తులు పాల్గొనాలని వారు కోరారు.

నేడు సమావేశం

అట్లూరు : ఎందుకు ఆంధ్రాకి జగనే సీఎం కావాలి అనే అంశంపై అట్లూరు మండలానికి సంబంధించి బొజ్జిరెడ్డి కల్యాణ మండపంలో గురువారం సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ ముడమాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు పాల్గొంటారని మండలంలోని ప్రజాప్రతినిధులు, మండల కన్వీనర్, సచివాలయాల మండల కన్వీనర్, గృహసారధులు, వలంటీర్లు, కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

నేడు ఖాదర్‌పల్లెలో జగనన్న ఆరోగ్య సురక్ష

చాపాడు : మండలంలోని ఖాదర్‌పల్లె గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు తెలిపారు. గ్రామంలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకూ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేస్తారన్నారు.

గ్రామీణ డాక్ సేవకుల సమ్మె


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఫారెస్టు అధికారులు

మైదుకూరు : మైదుకూరులోని సబ్ పోస్టాఫీసు వద్ద బుధవారం గ్రామీణ డాక్ సేవకులు సమ్మె చేశారు. ఆల్ ఇండియా గ్రామీణ డాక్ ఆఫ్ గ్రామీణ డాక్ సేవక్స్ పిలుపు మేరకు తాము ఒక రోజు సమ్మె చేస్తున్నట్లు ఈ సందర్భంగా డాక్ సేవకులు తెలిపారు. 8 గంటల పని కల్పించాలని, పెన్షన్‌తో సహా అని ప్రయోజనాలను తమకు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. గ్రూప్ ఇన్సూరెన్స్, గ్రాట్యూటీ రూ.5లక్షలకు పెంచాలని కోరారు. తమకు, తమ కుటుంబ సభ్యులకు వైద్య సౌకర్యం కల్పించాలని తెలిపారు. సమ్మె చేసిన వారిలో సలీం, సాయి, రమణ, బ్రహ్మం, నూరుల్లా, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు త్రిదండి సంపత్‌కుమార జీయర్ స్వామి రాక

కడప కల్చరల్ : విజయవాడకు చెందిన అష్టాక్షరి పీఠాధిపతి శ్రీ త్రిదండి అష్టాక్షరి సంపత్‌కుమార రామాను జీయర్ స్వామి శుక్రవారం ఉదయం 9.00 గంటలకు కడప నగరంలోని అమ్మవారిశాల వద్దగల వాసవీ సదన్‌కు రానున్నట్లు ఆర్యవైశ్య ప్రముఖులు తెలిపారు.

గోదా గోకులం వ్యవస్థాపక అధ్యక్షులు మారం నాగరాజుగుప్తా, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, వీహెచ్‌పీ దక్షిణాంధ్ర ప్రాంత ధర్మాచార్య సంపర్క్ ప్రముఖ్ బెస్తవేముల రామమహేష్, మునగా శ్రీనివాసకుమార్, పుట్టా రంగయ్య తదితరుల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. సనాతన భారతీయ తాత్విక చింతన వ్యాప్తి చేయడం కోసం సమాజంలోని రుగ్మతలను తొలగించి శాంతిని నెలకొల్పడం కోసం ఉభయ తెలుగు రాష్ట్రాలలో స్వామిజీ పర్యటన చేస్తున్నారని తెలిపారు.

జగనన్నే మళ్లీ సీఎం కావాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

కలసపాడు : సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలు క్షేత్రస్థాయిలో అర్హులకు అందాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోమారు ముఖ్యమంత్రిగా ఉండాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు తెలిపారు. బుధవారం స్థానిక సీఎంఆర్ కల్యాణ మండపంలో మండలంలోని జేసీఎస్ కన్వీనర్లు, గృహసారధులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ముఖ్య నాయకులతో వర్క్ షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వాల్లో పథకాలు పొందాలంటే రాజకీయ సిఫార్సులు తప్పనిసరి అని, జగనన్న ప్రభుత్వంలో అలాంటి పరిస్థితి లేదన్నారు. త్వరలో గ్రామాల్లో పల్లెనిద్ర కార్యక్రమం ప్రారంభమవుతుందని, పార్టీ ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, జేసీఎస్ కన్వీనర్లు పల్లెనిద్రలో పాల్గొని ఇంటింటికి వెళ్ళి జగనన్న అమలు చేసిన పథకాలను వివరించాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల నాయకులు అంకనగురివిరెడ్డి, సూదా రామకృష్ణారెడ్డి, పురుషోత్తంరెడ్డి, సుదర్శన్, నారాయణయాదవ్, చిత్తారాజశేఖర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఎ.విజయభాస్కర్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

పశు పోషణలో శాస్త్రీయ పద్ధతులు పాటించాలి


శిబిరాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు రెడ్డి, కళాశాల అసోసియేట్ డీన్ వైకుంఠరావు

ప్రొద్దుటూరు : పశు పోషణలో శాస్త్రీయ పద్ధతులు పాటించడం వలన అధిక లాభాలను పొందవచ్చని పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.వైకుంఠరావు తెలిపారు. మండలంలోని తాళ్లమాపురంలో పశుధన్ ప్రగతి అభియాన్, భారత ప్రభుత్వ పశుసంవర్ధక శాఖ ఆర్థిక సహాయంతో పశువైద్యకళాశాల ఆధ్వర్యంలో పశువులలో పునరుత్పత్తి, ఫలదీకరణ శిబిరం, రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఎం.కొండారెడ్డి పశు పోషకులు అధికారుల సలహాలు, సూచనలు విని ఏవైనా సందేహాలుంటే నివృత్తి చేసుకోవాలని సూచించారు. పశుసంవర్ధకశాఖ జమ్మలమడుగు డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎస్ఏ శ్రీనివాసులురెడ్డి, డివిజనల్ ఏడీ ఆర్. శ్రీధర్‌రెడ్డి, ప్రొద్దుటూరు డివిజనల్ ఏడీ డాక్టర్ ధనుంజయ్‌రెడ్డి పశువుల యాజమాన్య పద్ధతులను వివరించారు. ఈ శిబిరంలో 289 గొర్రెలు, మేకలు, 83 దూడలకు నట్టల నివారణ మందు తాపించారు. 159 ఆవులు, గేదెలకు గర్భకోశ సంబంధిత వ్యాధులు, 87 పశువులకు వివిధ వ్యాధులకు చికిత్స చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎం.పాలకొండారెడ్డి, ఎస్.వీరారెడ్డి, వీఏఎస్ డాక్టర్ మాధవ ఓబుళరెడ్డి, ప్రొద్దుటూరు పశువైద్య కళాశాల అధ్యాపకులు డాక్టర్ సుధాకర్‌రెడ్డి, డాక్టర్ కె.జ్యోతి, డాక్టర్ కె.సాయి గుణరంజన్, డాక్టర్ ఎస్.సుమిరన్, డాక్టర్ కె.రాంబాబు, డాక్టర్ పి.రాయల్‌రెడ్డి, డాక్టర్ సునీత ప్రసాద్ పాల్గొన్నారు.